నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

• ముస్తాబైన ఆలయం



రాజురాలో ముస్తాబైన శివపంచాయతన శివమార్కండేయస్వామి ఆలయం

ఖానాపూర్: కార్తీకమాస పర్వదినం పురస్కరించుకొని మండలంలోని రాజురా గ్రామంలో ఉన్న శ్రీ శివపంచాయతన శివమార్కండేయస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. శివపంచాయతన శివ మార్కండేయ ప్రతిష్ఠతోపాటు నవగ్రహ ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల 4 నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి, చైతన్యానంద స్వామిజీ, జగద్గురు గీతా ఆశ్రమ వ్యవస్థాపకులు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పండితులు నర్సింహమూర్తి, విష్ణుంభట్ల రాజశేఖర శర్మ, గుడి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి 8వరకు ఉత్సవాలు..

ఈ నెల 4న గ్రామంలోని శివపంచాయతన మార్కండేయస్వామి నవగ్రహ ధ్వజస్తంభ సహిత ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా విగ్రహమూర్తులను పుర వీధుల నడుమ ఊరేగించనున్నారు. ఈసందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, అంకురార్పణ, రక్షాబంధనం, రుత్విక్ వరణం, షోడశ గౌరీ సప్తమాతకత, యాగశాల సంస్కార ప్రవేశం, 5న అగ్ని ప్రతిష్ఠ మహాగణపతి, ప్రీతికరం, సహస్ర మొదుక హవనం, మూల మంత్రహోమాలు, స్థాపిక దేవతా హోమాలు, పంచసూక్త రుద్ర హోమాలు, మహా మత్యుంజయ హోమాలు, విగ్రహమూర్తుల పంచామృత నవరస పంచగవ్య విశేష అష్టోత్తర శత ఔషధి యుక్త ఏక వింశతి కలిశ మహా స్నపనం, చతుర్వేద సంహిత మంత్ర పూర్వక మహాజలాధివాసం, 6న గణపతి హోమం, నిత్యహోమాలు, చతుర్వే పారాయణం, సామూహిక కుంకుమార్చనలు, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాదివాసం, 7న అరుణహోమం, లక్ష్మీనారాయణ, సుదర్శన హోమాలు, కుంకుమార్చన, విశేష పూలతోపాటు బిల్వపత్రితో ప్రదోష క్రమార్చన, 8న ప్రతిష్ఠాంగ హోమాలు, దేవతా యంత్రప్రతిష్ఠాపన, విగ్రహస్థాపన, గణపతి, పార్వతి, ఆదిత్య, విష్ణులింగ మార్కండేయ నంది ధ్వజ నవగ్రహ శిఖర ప్రాణ ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి, శిఖర యంత్రస్థాపన, శివపార్వతుల శాంతి కల్యాణమహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నారు.

గుట్టలను తవ్వేస్తున్నారు..!



సిర్పెల్లిలో రోడ్డు పక్కనున్న గుట్ట నుంచి మట్టిని తీసుకెళ్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

• అభివృద్ధి పేరిట అక్రమ దందా
• పట్టించుకోని అధికారులు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో గుట్టల్లోని మట్టిని తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు కొందరు అక్రమార్కులు. దీంతో గుట్టలు కనుమరుగవుతున్నాయి. పట్టించుకోవాల్సిన సంబంధితశాఖల అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. కుభీర్ మండలంలో 42 గ్రామపంచాయతీలుండగా.. కుభీర్, దొడర్నా, వీర్గాం, బ్రహ్మేశ్వర్, పల్సి తదితర గ్రామాల్లో ఉన్న గుట్టల్లోని మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ అక్రమార్కులు రూ.లక్షలు సంపాదిస్తున్నారు. అనుమతుల్లేకుండా పొక్లెయిన్ల సాయంతో గుట్టలను తవ్వి మొరాన్ని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. కొత్తగా ఇళ్లు కట్టుకునేవారికి, సీసీ రోడ్ల నిర్మాణంలోనూ ముందు మొరం వేసి దానిపై సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. బీటీ రోడ్లు వేసేవారు సైతం సైడ్‌గావెల్‌గా మట్టినే ఉపయోగిస్తుండటంతో డిమాండ్ పెరిగింది.

అక్రమార్కుల దందా..

అభివృద్ధి పేరు చెప్పి అక్రమార్కులు తమ దందాను కొనసాగిస్తున్నారు. అధికారులు ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలను పట్టుకుంటే అభివృద్ధి పనుల కోసమని చెప్పి జారుకుంటున్నారు. వినకుంటే రాజకీయ నాయకుల నుంచి అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొరం అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకొని ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు ఇవీ..

నిబంధనల ప్రకారం భూగర్భ జలవనరులశాఖ(మైనింగ్)అనుమతులు తీసుకోవాలి. ప్రభుత్వానికి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పట్టా, ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టేందుకు అటవీ, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. పంచాయతీలకు పన్ను చెల్లించి మట్టి ఉన్న ప్రాంతంలో ఎంత మేర అనుమతి ఇవ్వాలో రెవెన్యూ అధికారులు నిర్ణయిస్తారు. మైనింగ్ అధికారులు వేబిల్లు జారీ చేయాలి.. కానీ ఈ నిబంధనలను ఎవరూ పాటించడం లేదు.

చర్యలు తీసుకోవాలి



గుట్టల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిఘా ఏర్పాటు చేయాలి.

–జాదవ్ పండిట్, సిర్పెల్లి

పర్యావరణాన్ని కాపాడాలి



ప్రభుత్వ యంత్రాంగం మొరం అక్రమ రవాణా అడ్డుకట్ట వేసి గుట్టలను కాపాడాలి. పర్యావరణ పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

– సాయినాథ్, పార్డి(కె)

మా దృష్టికి వస్తే చర్యలు

మా దృష్టికి వస్తే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా గుట్టలు తవ్వితే ఆయా గ్రామాల ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

– ఎం.సోము, తహసీల్దార్, కుభీర్

చిలుకలయ్య, కోరుగుట్టయ్య జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

పెంబి: మండలంలోని మందపల్లిలో చిలుకలయ్య, కోరుగుట్టయ్య జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అగ్నిగుండాలు దాటుతూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కేశఖండన, తులభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు నిర్మల్ దేవేందర్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పూజారులు అర్జన్న, విష్ణు, భోజన్న, ముదిరాజు సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

10న సంఘం ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న పద్మశాలీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఉత్తర విభాగం పద్మశాలి సంఘం ఏర్పాటు చేయనున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నందన డిగ్రీ కళాశాలలో ఆదివారం పద్మశాలీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10న నందన కళాశాలలో ఉదయం 11 గంటలకు సభ్యత్వం, సంఘ నియమావళి, పొదుపు చిట్టీ, సంఘ కార్యకలాపాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉత్తర విభాగంలోని పద్మశాలీలు హాజరవాలని కోరారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, పద్మశాలి కులస్తులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడెం: మండలంలోని సారంగపూర్‌కు చెందిన కుమ్మరి వంశీకృష్ణకు రూ.13 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి సుధాకర్, కోల శ్రీనివాస్, మార్కపు లక్ష్మణ్, కుమ్మరి భూమన్న, ఆనందం, భీమలింగు, రాజన్న, కొండయ్య తదితరులున్నారు.

పరామర్శ

నర్సాపూర్(జి): మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన కడుగొల్ల దయాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలవగా నిజామాబాద్ శ్రీ విష్ణు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. సమత ఫౌండేషన్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వారి వెంట ఫౌండేషన్ నిర్వాహకులు సాహెబ్‌రావు, పీఆర్వో క్రాంతి, సీఈవో అనిల్, ప్రవీణ్, సంతోష్, శేఖర్, దేవేందర్‌పటేల్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బ్రహ్మణ్‌గావ్‌లో కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ముధోల్: మండలంలోని బ్రహ్మణ్‌గావ్, కారేగాం, గ్రామాల్లో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పర్యటించారు. ఇటీవల పలువురు మరణించగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వారి వెంట ముధోల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు మోహన్‌రెడ్డి, తాటివార్ రమేశ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో నాయకుడు మృతి



ఆనంద్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన నల్లోల ఆనంద్ (36) అనే యువ నాయకుడు శనివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. గతంలో ఈ యన నిర్మల్ బీజేపీ అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పని చేశాడు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలకు నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించా రు. ఆనంద్‌కు భార్య నవీన, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీఎస్‌ఐ మండల కార్యవర్గం

ముధోల్: మండల కేంద్రంలోని నాగార్జుననగర్ బుద్ధవిహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్‌ఐ) ముధోల్ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గంగాధర్ సోన్‌కాంబ్లే, ప్రధాన కార్యదర్శిగా అశోక్ వాగ్మారే, కోశాధికారిగా పరమేశ్ దుమనే, సంస్కార విభాగము ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్ టోకరే, సంరక్షణ విభాగం ఉపాధ్యక్షుడిగా విశ్వంబర్ జోంధ్లే, నిర్వాహకులుగా శంకర్ వాగ్మరే, దత్తారం దేవ్కే, శ్రావణ్ సోంకాంబ్లే, లక్ష్మణ్ దాస, రాజురామ్ జుల్పేకర్, భోజన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, నిర్వాహకులు సంజీవ్ సుస్లేకర్, గంగాధర్ శృంగారేర, సంజీవ్ గాదేవార్, అశోక్, కొంతం రాజేశ్వర్, అమృత్ తర్డే, భోజారాం, వాగ్మారే తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం



మాజీ మంత్రికి ఆహ్వానం అందిస్తున్న సభ్యులు

ఖానాపూర్: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ సంఘం సభ్యులు ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్నకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 10న ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బీసీ రాజన్న, బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, సిరిపురం నాగరాజు, మడిగెల గంగాధర్, కొక్కుల ప్రదీప్, కడుకుంట్ల రవి తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పర్యటించనున్నారు. ఉదయం 11:30 గంటలకు నర్సాపూర్, మధ్యాహ్నం 12 గంటలకు లక్ష్మణచాంద నుంచి నర్సాపూర్ ఎక్స్ రోడ్డు వరకు బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన, మధ్యాహ్నం మండల కేంద్రంలో, ధర్మారంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి..లక్ష్మణచాందలో భీమన్న జాతరలో పాల్గొంటారు.

అయ్యప్ప సేవాసమితి కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం ఏపీనగర్, శాస్త్రీనగర్, శివాజీనగర్, గోపాల్‌నగర్, సంతోష్ నగర్ కాలనీల అయ్యప్ప దీక్షాపరులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీ అయ్యప్ప సేవాసమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆశ మొల్ల మోహన్, ఉపాధ్యక్షుడిగా, మెంచు శివాజీ, కార్యదర్శిగా దేశెట్టి వెంకటేశ్, కోశాధికారిగా, కెమ్ శెట్టి సాయిబాబా, గౌరవ సలహా సభ్యులుగా సాయినాథ్, సాయి ప్రసాద్, రాములు తదితరులను ఎన్నుకున్నారు. అయ్యప్ప భక్తులు కలకడవారి నరేశ్, మంచాల్ నరేశ్, కొట్టుర్వార్ రాజేశ్, ఉప్పు నరేందర్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై భాస్కరాచారి

కుంటాల: మండలంలోని కల్లూరు నుంచి కుంటాల వెళ్లే రహదారిపై ఆదివారం ఎస్సై భాస్కరాచారి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు. ఏఎస్సై రాందాస్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సంపత్, ప్రశాంత్, మహ్మద్, సాయికిరణ్, విజయలక్ష్మి ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఆదివారం కల్లూరులో వీరిని మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌పటేల్, పసుల నవీన్, రజనీకాంత్ రావు, పెంటవార్ దశరథ్, చింతకుంట ప్రసాద్, సాయిరాం, భరత్ భూషణ్, దత్తు ఉన్నారు.

నేటి నుంచి శత చండీయాగం



భైంసాలోని అయ్యప్ప ఆలయం

భైంసా: పట్టణంలోని అన్నపూర్ణక్షేత్రంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శత చండీయాగం సోమవారం ప్రారంభంకానుంది. మూడు రోజులపాటు నిర్వహించే యాగం కోసం ఇప్పటికే ఆలయం ముందు యాగశాలలను సిద్ధం చేశారు. ఈ యాగంలో వందలాది జంటలు పాల్గొననున్నాయి. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ తెలిపారు.

అబుల్ కలాంకు నివాళి



స్వర్ణలో నివాళులర్పిస్తున్న నాయకులు

సారంగపూర్: మండల కేంద్రంతోపాటు స్వర్ణ గ్రామంలో కలాం గుణం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రజాప్రతినిధులు సుజాత నర్సారెడ్డి, సామల పద్మఫీ రయ్యా, నాయకులు మహేశ్‌రెడ్డి, సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు మహ్మద్ ఉస్మాన్, సొసైటీ మండలాధ్యక్షుడు నయీం ఉన్నారు.

యాసంగి పనుల్లో బిజీ



కుంటాలలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల రైతులు యాసంగి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఆదివారం ఓలా, కుంటాల శివారులో మొక్కజొన్న విత్తనాలు వేస్తూ.. చేన్లకు నీటి తడులు అందిస్తూ కనిపించారు.



ఓలా శివారులో మొక్కజొన్నకు నీటితడులు అందిస్తున్న రైతు

బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఆలయ 40వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేశ్, నాయకులు టి.లక్ష్మణ్, ఎల్.రాములు, సుధాకర్, తోట సత్యం, రాం భీమన్న, ఎల్.లక్ష్మణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

గోదావరికి తరలిన భీమన్న గదలు



భీమన్న గదల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సోమవారం భీమన్న జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం భీమన్నగదలను గంగస్నానానికి తరలించగా భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత భీమన్న గదలను సోమవారం ఉదయం ఆలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తర్వాత ప్రత్యేక పూజలు చేసి జాతర జరుపనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రజలు తమ భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, నీటి, మురికి కాలువలు, ఫారెస్ట్, పెన్షన్ తదితర సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న సుష్మారెడ్డి

లోకేశ్వరం: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి సుష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణమండపంలో బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా పలువురు పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించారు. కార్యక్రమంలో ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, నల్ల రమేశ్, సాయినాథ్ పటేల్, సరస్వతి, సంటెన్న, మెండె శ్రీధర్, మురళి, రమణ ఉన్నారు.

సంఘం బలోపేతానికి సాయం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఆదివారం మేర సంఘ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం బలోపేతం కోసం ఖానాపూర్ ఆదిత్య ఆసుపత్రి డాక్టర్ సన్నిత్ కుమార్ తనవంతుగా రూ.10వేలను సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పూసపత్రి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండలాధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు నరేందర్, అశోక్, కోడిగంటి నారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహా సమ్మేళనానికి తరలిన కార్యకర్తలు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని ఆదిభట్లలో ఆదివారం ఏర్పాటు చేసిన ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనానికి నిర్మల్ జిల్లా నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల కోసం పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ ఒక గొప్ప ప్రణాళికను రూపొందిస్తారని పేర్కొన్నారు. ఇందులో కమిటీ సభ్యులు కల్లూరు సుధాకర్, సొన్న భూమేశ్, రాజు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

తానూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఈనెల ఆరో తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ లింగంమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న యువత ఓటరు నమోదుకు అర్హులన్నారు. ఆన్‌లైన్ లేదా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

చోదకులు నిబంధనలు పాటించాలి

ఖానాపూర్: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేశారు. అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.